ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నేడే గురువుల పోరు

◆ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ◆ సర్వం సిద్ధం
◆ ఓటు వేయనున్న 22,493 మంది టీచర్లు
◆ పటిష్ట బందోబస్తు నడుమ 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/అనకాపల్లి ప్రతినిధి/విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుండటంతో ఎక్కడ ఎటువంటి పొరపాట్లుకూ తావులేకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈసారి గురువుల పోరు ఉత్కంఠగా సాగుతోంది. బరిలో పది మంది ఉన్నప్పటికీ ప్రధాన పోటీ కూటమి బలపరిచిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, బిజెపి మద్దతునిస్తున్న పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మధ్యనే నెలకొంది. ఈ ఎన్నికలు తుది అంకానికి చేరేసరికి విజయగౌరి పట్ల సర్వత్రా గురువుల మొగ్గు కనిపిస్తోంది. విద్యారంగ పరిరక్షణకు కృషి చేసే ఆమెను గెలిపించుకుంటామని పలువురు ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. ఇక పోలింగ్ ఏర్పాట్లు విషయాన్ని పరిశీలిస్తే..

ఉత్తరాంధ్రలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్నింటి వద్దా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ విధించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు 739 మంది అధికారులను, సిబ్బందిని కేటాయించారు. మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 13,508, మహిళలు 8,985 మంది ఉన్నారు. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళంలో 31, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్నంలో 13, అనకాపల్లిలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళంలో 5,035 మంది, విజయనగరంలో 5,223 మంది, పార్వతీపురం మన్యంలో 2,333 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 1,488 మంది, విశాఖ జిల్లాలో 5,529 మంది, అనకాపల్లి జిల్లాలో 2,885 మంది ఓటర్లు ఉన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మార్చి 3న కౌంటింగ్ ఉంటుంది.

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది పయనం

పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసేందుకు ఎయు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచే అక్కడ పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందజేశారు. దీంతో వారంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ తీసుకుని పయనమయ్యారు.

అందరి నోటా 'విజయ'గౌరి మాట



పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన కోరెడ్ల విజయగౌరి ఈ ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఎవరినోటా విన్నా ఆమె పేరునే వినిపిస్తోంది. విజయావకాశాలు ఆమెకే ఉంటాయన్న విశ్లేషణలు ఊపందుకున్నాయి. పోలింగ్ సమయం దగ్గరపడుతున్నకొద్దీ సమీకరణాలన్నీ విజయగౌరికి మద్దతుగా మారుతున్నాయి. దీంతో పిడిఎఫ్ మద్దతుదారులంతా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో యుటిఎఫ్ నాయకురాలిగా విజయగౌరి చూపిన చొరవ, నిజాయితీ, నిబద్ధత, కుటుంబ నేపథ్యం, పిడిఎఫ్ తరపున పోటీ చేయడం ఇందుకు ముఖ్య కారణాలుగా చెప్పుకోవచ్చు. దీనికి తోడు పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ఎపిటిఎఫ్, పిఆర్‌టియుల్లో అంతర్మథనం మొదలైంది. ఎంతైనా ఉపాధ్యాయులు, వారి సంఘాల మిగతా 2లో..



పోలింగ్ సామగ్రితో తమకు కేటాయించిన ప్రాంతాలకు వెళ్తున్న సిబ్బంది

సర్వత్రా 'మండలి' ఆసక్తి

- విద్యారంగాన్ని పరిరక్షించేవారికే ఓటు : ఉపాధ్యాయులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఈ ఎన్నికలను ఉపాధ్యాయులేకాకుండా ఉపాధ్యాయేతరులు సైతం ఎంతో ఆసక్తితో చూస్తున్నారు. తమ సమస్యలను శాసన మండలిలో అడిగేవారు, ప్రశ్నించడం ద్వారా పరిష్కారానికి ముందుకెళ్లేవారికే తాము 'నెంబర్-1 ప్రాధాన్యత' ఇస్తామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీన్ని మిగతా 2లో..

చికెన్ దుకాణాలు వెలవెల

▶ వార్త 2లో..

విరామం.. ఉపయుక్తం!

▶ వార్త 3లో..

నదిలో మునిగి యువకుడు మృతి

▶ వార్త 3లో..



ఆర్‌కె బీచ్‌లో ఏర్పాటు చేసిన మహా శివలింగం

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

బీచ్ రోడ్డులో మహా కుంభాభిషేకం వార్తలు 2, 7 పేజీల్లో..

సమీపిస్తున్న ఇకెవైసి గడువు

◆ 4,422 మంది నమోదుపై దృష్టి ◆ ఎక్కువ మంది రైతులున్న మండలాలపై వ్యవసాయశాఖ కేంద్రీకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రైతు పంట ఇ-నమోదు, ఇకెవైసి చేసుకొనే గడువు సమీపిస్తోంది. మార్చి 3 నాటికి ఇకెవైసి గడువు ముగియనుంది. జిల్లాలో రబీలో 31,655 ఎకరాల్లో 27,163 మంది రైతులు వరి, పెసలు, మినుములు సాగు చేశారు. ఈ మూడు పంటలు బీమా పరిధిలోకి రానున్నాయి. ఇ-పంట నమోదు, ఇకెవైసి పూర్తిచేయాలని కొద్ది రోజుల క్రితం వ్యవసాయశాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గడువు చివరి వరకూ చూడకుండా ఈ నెల 28 నాటికి శత శాతం పూర్తిచేయాలని సూచించారు. సాగు చేసిన 27,163 మంది రైతులకు చెందిన 31,655 ఎకరాల్లో 22,742 మంది రైతులకు చెందిన 26,603 ఎకరాల విస్తీర్ణంలో ఇకెవైసి (84 శాతం) పూర్తయింది. ఇంకా 4,422 మంది రైతులు ఇకెవైసి చేసుకోవాల్సి వుంది. గడువులోపు ఇకెవైసి పూర్తి చేస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారి బి.మోహనరావు తెలిపారు.

ఇకెవైసి చేసుకోలేని రైతుకు బీమా సౌకర్యం వర్తించే అవకాశముండదు. ప్రతి రైతూ తాము పండించే పంటలకు ఇ-పంట, ఇకెవైసి చేసుకోవాల్సివుంది. ఇ-పంట, ఇకెవైసి చేసుకోని రైతు పంట ఏ కారణంగానైనా మిగతా 2లో..



వి.మాడుగుల మండలం కింతలివల్లపురంలో ఇకెవైసి నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

మొదటి పేజీ తరువాయి..

అందరినోటా 'విజయ'గౌరి మాట

మధ్య పోటీ ఉండాలి తప్ప, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పడమే కాకుండా, నిలదీసిన నాయకులపై నిర్బంధాలు, బెదిరింపులకు పాల్పడిన పార్టీల పంచన చేరిపోవడం సరికాదనే చర్చ రెండు రోజులుగా యావత్తు ఉపాధ్యాయ రంగంలో నడుస్తోంది. ముఖ్యంగా ఎపిటిఎఫ్ తరపున బరిలో నిలిచిన రఘువర్మకు మద్దతుగా టిడిపి నేతలు నేరుగా రంగంలోకి దిగి ప్రచారం చేయడం ఆ సంఘంలోని మెజార్టీ ఉపాధ్యాయులకు మింగుడుపడడం లేదు. 'ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మనం అధికార పార్టీ మద్దతుతో గెలిస్తే తిరిగి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించగలమా?' అంటూ ఆ సంఘంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతున్నట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలో ఎపిటిఎఫ్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉద్యమాల్లో ఆరితేరిన విజయగౌరివైపు చూస్తున్నారు. అటు ఓటమి తప్పదని భావించిన గాదె శ్రీనివాసుల నాయుడు కులం, ప్రాంతం అంశాలను తెరపైకి తెచ్చారు. ఇది కూడా పిఆర్‌టియులోని చాలా మంది ఉపాధ్యాయులకు నచ్చడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో గాదె కన్నా విజయగౌరి మిన్న అన్నట్టుగా ఎక్కువమంది భావిస్తున్నారు. తొలి నుంచి ప్రధానమైన పోటీ ఈ ముగ్గురి మధ్యే ఉంటుందన్న విశ్లేషణలు వెలువడినప్పటికీ తాజాగా పరిణామాలు విజయగౌరికి మరింత సానుకూలంగా మారాయి.

సమీపిస్తున్న ఇకెవైసి గడువు

దెబ్బతిన్నా పరిహారం రాకుండాపోతుంది. రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాల్సివుంది. గ్రామస్థాయిలో వ్యవసాయ అసిస్టెంట్లు రైతుల పంట ఇకెవైసి చేస్తున్నారు. చోడవరం మండలంలో 95 శాతం ఇకెవైసి పూర్తయింది. ఇంకా 33 మంది రైతులు మాత్రమే ఇకెవైసి చేసుకోవాల్సివుంది. 24 మండలాలకుగానూ రాంబిల్లి మండలంలో ఇకెవైసి నమోదు వెనుకబాటులో వుంది. అత్యధికంగా ఈ మండలంలో 674 మంది ఇకెవైసి చేసుకోవాల్సివుంది. ఇకెవైసి చేసుకోవాల్సిన ఎక్కువ మంది రైతులున్న మండలాలపై ప్రత్యేకంగా కేంద్రీకరించి గడువులోపు నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని వ్యవసాయశాఖాధికారులు భావిస్తున్నారు.

చోడవరం మండలంలో 33 మంది, దేవరాపల్లిలో 283, రావికమతంలో 76, సబ్బవరంలో 34, రోలుగుంటలో 87, అనకాపల్లిలో 26, ఎస్.రాయవరంలో 452, మాకవరపాలెంలో 95, బుచ్చయ్యపేటలో 98, కె.కోటపాడులో 73, మునగపాకలో 44, కోటవురట్లలో 110, నర్సీపట్నంలో 155, చీడికాడలో 190, కశింకోటలో 80, మాడుగులలో 292, నాతవరంలో 546, నక్కపల్లిలో 134, పాయకరావుపేటలో 352, యలమంచిలిలో 334, గొలుగొండలో 138, పరవాడలో 82, అచ్యుతాపురంలో 34, రాంబిల్లిలో 674 మంది రైతులు ఇకెవైసి చేసుకోవాల్సి ఉంది. ఏ కారణంగానైనా వీరు గడువులోగా ఇకెవైసి చేసుకోలేకపోతే ప్రభుత్వ పరమైన పరిహారానికి దూరంకానున్నారు.

యుటిఎస్ యాప్ వాడకానికి రైల్వే ప్రోత్సాహం

- ఆర్-వ్యాలెట్ లావాదేవీలపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ అన్ రిజర్వుడ్ ప్రయాణాల కోసం మొబైల్ టికెట్ బుకింగ్ ప్రయాణికులను ప్రోత్సహించడానికి ముమ్మర అవగాహన కార్యక్రమాలు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే యుటిఎస్ యాప్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. 2016లో ప్రారంభించిన యుటిఎస్ మొబైల్ యాప్ ద్వారా వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో ప్లాట్‌ఫారం జర్నీ, సీజన్ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. యుటిఎస్ మొబైల్ యాప్ ద్వారా అన్ రిజర్వుడ్ టికెట్ బుకింగ్ కోసం ఆర్-వాలెట్ లావాదేవీలపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఇస్తున్నారు. ఈ పథకాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 24 వరకూ పొడిగించింది. ఈ బోనస్ తక్షణమే వినియోగదారుడి ఆర్-వాలెట్‌కు క్రెడిట్ చేయబడుతుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి యుటిఎస్ మొబైల్ యాప్ డిజిటల్ లావాదేవీలు, కాగిత రహిత టికెటింగ్‌ను మరింత ప్రోత్సహిస్తుంది. ప్రయాణికులు పాపులర్ డిజిటల్ పేమెంట్ ఆప్షన్లను ఉపయోగించి అన్ రిజర్వుడ్ టికెట్లను కొనుగోలు చేయవచ్చు. వాల్తేరు డివిజన్ స్టేషన్లలో వివిధ మీడియా వేదికలు, పోస్టర్లు, బ్యానర్లు మొదలైన వాటిని ఉపయోగించడం ద్వారా యుటిఎస్ మొబైల్ యాప్‌ను ప్రోత్సహించడానికి రైల్వే సమగ్ర చర్యలు చేపట్టింది. అన్ రిజర్వుడ్ టికెట్ల బుకింగ్ కోసం యుటిఎస్ యాప్‌ను ఎలా డౌన్ లోడ్ చేసుకోవాలో, ఎలా ఉపయోగించాలో ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసింది. టికెట్ బుకింగ్స్, డిజిటల్ చెల్లింపుల కోసం యుటిఎస్ యాప్‌ను ప్రయాణికులు త్వరగా యాక్సెస్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్లను అందుబాటులోకి తెచ్చారు.



యాప్‌ను ఉపయోగిస్తున్న విద్యార్థులు

బీచ్ రోడ్డులో మహా కుంభాభిషేకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బుధవారం భక్తిశ్రద్ధల నడుమ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మహా శివరాత్రి వేడుకలు సాగాయి. శివాలయాలన్నీ కిటకిటలాడాయి. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్‌కె బీచ్ వద్ద మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 40వ మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. సాగరతీరాన బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి కోటి 8 లక్షల శివలింగాలకు మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో భక్తులచే స్వయంగా టిఎస్‌ఆర్ అభిషేకం చేయించారు. భక్తులకు రుద్రాక్షలు, పసుపు తాళ్లు అందజేశారు. మధ్యాహ్నం స్వామి వారి కల్యాణం, అనంతరం హోమం జరిగాయి. మహా కుంభాభిషేకం సందర్భంగా తీరానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందీ కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశారు.

నేడే గురువుల పోరు

(మొదటి పేజీ తరువాయి..) బట్టి ఉపాధ్యాయ ఓటర్లలో ఈ మండలి ఎన్నికలు చర్చకు దారితీశాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. మార్పు కోసం టీచర్లలో చర్చ నడుస్తోంది.

అనకాపల్లి జిల్లాలో..

ఎన్నికల సంఘం ఆదేశాలతో గురువారం అనకాపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు కలెక్టర్ విజయకృష్ణన్ సెలవు ప్రకటించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అల్లర్లూ జరగకుండా ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించారు. జివిఎంసి హైస్కూల్ నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల నిర్వహణ సామగ్రిని తీసుకొని పోలింగ్ సిబ్బంది బుధవారానికే కేంద్రాలకు చేరారు. జిల్లాలోని 24 పోలింగ్ కేంద్రాల్లో 2,885 మంది ఉపాధ్యాయ, అధ్యాపకులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం బయట, లోపల రెండు వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ చేసి, దానిని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించనున్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం ప్రకటించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ప్రతి రెండు గంటలకూ పోలింగ్ శాతం తీసుకొని, వెల్లడించడానికి సిబ్బందిని నియమించారు. పది మంది సెక్టోరియల్ అధికారులు, పది మంది రూట్ ఆఫీసర్లు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు. జివిఎంసి హైస్కూల్ నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లే సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ విజయకృష్ణన్ పలు సూచనలు చేశారు.

విశాఖ జిల్లాలో..

విశాఖ జిల్లాలో 13 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. వీటిని నగర పరిధిలోని పెదగంట్యాడ, గాజువాక, పెందుర్తి, చినవాల్తేరు, డాబాగార్డెన్స్, రైల్వే న్యూ కాలనీ, కంచరపాలెం, మల్కాపురం, గోపాలపట్నం, మధురవాడతో పాటు గ్రామీణ భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాలలో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసినట్టు ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. వీటన్నింటినీ ఆయా ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సందర్భంగా ఉత్తరాంధ్రలోని అన్ని పాఠశాలలకూ సెలవు ప్రకటించినట్టు తెలిపారు.

ఉపాధ్యాయ ఓటర్లూ.. ఇలా చేయండి

ఓటు వేసేందుకు మార్గదర్శకాలివే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాధారణ ఎన్నికలకు, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. సాధారణ ఎన్నికలలో మనకు నచ్చిన అభ్యర్థికి, నచ్చిన ఎన్నికల గుర్తుకు ఓటు వేయవచ్చు. బ్యాలెట్ పేపర్ ఎన్నికలు అయినా, ఇవిఎం మిషన్లతో నిర్వహించే ఎన్నికలు అయినా పోటీలో ఉన్న అభ్యర్థులకు ఒకరికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది. అయితే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఇందుకు కాస్త భిన్నంగా ఓటు వేయాల్సి ఉంటుంది. ఇటువంటి ఎన్నిక సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు అందరికీ, ప్రాధాన్యతా క్రమంలో ఓట్లు వేసే అవకాశం ఉంది. గురువారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరుగనుంది. ఉపాధ్యాయ ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ ద్వారా స్లిప్పులను ఈసరికే పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలో జన విజ్ఞాన వేదిక వారు ఓటర్లకు అవగాహన కల్పిస్తూ విస్తృతంగా ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రచారంలో భాగంగా జన విజ్ఞాన వేదిక నాయకులు చెప్పిన వివరాలపై ఓ లుక్కేద్దాం.

ఓటు ఎలా వెయ్యాలి ?

ఈ ఎన్నికల్లో పార్టీల గుర్తులు, ఎలక్ట్రానిక్ మెషీన్లు వుండవు. బ్యాలెట్ పేపర్లు మాత్రమే వుంటాయి. అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది. ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ మాత్రమే వాడాలి. ప్రాధాన్యతా క్రమంలో అందరి కంటే ఎక్కువగా ఇష్టపాత్రుడు/ఇష్టపాత్రురాలు పేరు ఎదురుగాగల గడిలో 1 అనే అంకెను వెయ్యాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి ప్రాధాన్యతను బట్టి 2, 3, 4 ఓట్లు వెయ్యవచ్చు లేదా వదిలెయ్యనూ వచ్చు. అందరికీ వెయ్యనక్కరలేదు. అవసరమనుకొంటే ఎందరి కయినా ఓటు వెయ్యవచ్చు. ఒకే అంకెను (నెంబరు) ఇద్దరికి వెయ్యరాదు. వేస్తే ఓటు చెల్లదు. రోమన్ అంకెలు రాయకూడదు. 1, 2, 3, 4 ఈ అంకెలే వెయ్యాలి. I, II, III, IV ఇలాంటివి వెయ్యరాదు. వేస్తే ఓటు చెల్లదు. ఒకటి, రెండు... అని తెలుగులో రాయవద్దు. అలా చేస్తే ఓటు చెల్లదు. టిక్ మార్కు కూడా చేయరాదు. one, two అని రాయకూడదు. రాస్తే ఓటు చెల్లదు. ఒక ఓటరు పోటీలో ఉన్న ఆరుగురు అభ్యర్థులకు ఓటు వేయాలని భావిస్తే ప్రాధాన్యతా క్రమంలో 1, 2, 3, 4, 5, 6 అంకెలను నచ్చిన అభ్యర్థులకు వేయవచ్చు.

1 నుండి 6 వరకు మధ్యలో ఒక అంకె మిస్ అయినా ఓటు చెల్లదు. ఒకే అభ్యర్థికి రెండు నెంబర్లు ఇవ్వరాదు. బ్యాలెట్ పేపర్‌పై ఎక్కడా ఓటు వేసినా వ్యక్తి సంతకం పెట్టకూడదు. ఒకవేళ పెడితే ఓటు చెల్లదు. ఓటింగ్‌కు వెళ్ళేటప్పుడు ఎన్నికల సంఘం సూచించిన ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పక తీసుకువెళ్లాలి.

చికెన్ దుకాణాలు వెలవెల

- పడిపోయిన కొనుగోళ్లు
- బర్డ్‌ఫ్లూ భయమే కారణం
- గగ్గోలు పెడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో చికెన్ దుకాణాలు కొద్ది రోజులుగా వెలవెలబోతున్నాయి. చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడమే దీనికి కారణం. రోజూ అమ్మే చికెన్‌లో సగం కూడా అమ్ముడు పోలేదని వ్యాపారులు అంటున్నారు. మాంసం ప్రియులకు ఇష్టమైన ఆదివారం రోజులో కూడా చికెన్ అమ్మకాలు మందగించడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. చికెన్‌తో పాటు కోడిగుడ్ల అమ్మకాలు కూడా బాగా తగ్గిపోయాయి. దీనంతటికీ కారణం బర్డ్ ఫ్లూ భయమే. సామాజిక మాధ్యమాలలో బర్డ్ ఫ్లూపై లేనిపోని భయాలు సృష్టిస్తూ సాగుతున్న ప్రచారంతో ఎక్కువమంది చికెన్, గుడ్లు తినడం మానేశారు. చికెన్ షాప్ కన్నెత్తి కూడా చూడటం లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ ధరలు బాగా తగ్గాయి. నగరంలో చికెన్ స్కిన్ లెస్ కిలో రూ.190కి, విత్ స్కిన్ రూ.170కి అమ్ముతున్నారు. లైవ్ రూ.92 ధర ఉంది. ఈ నెల 1వ తేదీన చికెన్ ధరలు స్కిన్ లెస్ కిలో రూ.210, విత్ స్కిన్ రూ.203గా ఉండేది. చికెన్‌తో పాటు కోడిగుడ్లు ధరలు కూడా బాగా తగ్గాయి. ఫిబ్రవరి 1న 100 గుడ్లు ధర రూ.505 ఉండగా, ఇప్పుడు రూ.450గా ఉంది. ఒక గుడ్డు ధర రూ.7 నుంచి రూ.5కి దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రజలలో చికెన్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి నష్టమూ జరగదని ఒకవైపు ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా, మరోవైపు పౌల్ట్రీ యజమానులు కూడా ప్రచారంలో భాగం పంచుకుంటున్నారు. బర్డ్ ఫ్లూ రాష్ట్రంలోని ఉభయగోదావరి జిల్లాలలో మాత్రమే చోటు చేసుకుందని, అక్కడ కూడా పూర్తిస్థాయిలో ఇది నివారణకు వచ్చిందని ప్రచారం చేస్తున్నారు. పత్రికల్లో పౌల్ట్రీల యజమానులు వారి వారి సంఘాల తరఫు ప్రకటనలు ఇచ్చారు కూడా. అక్కడితో సరిపుచ్చుకోకుండా ప్రజలకు నేరుగా బర్డ్ ఫ్లూ భయాన్ని తొలగించే చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఈ నెల 25న అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో సాయంత్రం ఐదు గంటలకు ప్రజల కోసం ఒక కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. అందులో పాల్గొన్నేవారికి వండిన చికెన్ కూరలు, ఉడకబెట్టిన గుడ్లు ఉచితంగా అందజేశారు. ప్రముఖ రాజకీయ నాయకులు, అధికారులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయినప్పటికీ ప్రజల్లో బర్డ్‌ఫ్లూ భయం పోలేదు.



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ షాప్

మటన్, చేపల అమ్మకాలు జోరు

ఇదిలా ఉండగా బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ వినియోగానికి దూరంగా ఉండటంతో మటన్, చేపలు అమ్మకాల జోరు పెరిగింది. వీటిని తినటానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్‌తో సహా నగరంలోని పలుచోట్ల ఉన్న చేపల బజార్లు, మటన్ విక్రయంలో దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి. దీంతో వీటి అమ్మకాలు పెరిగాయి. దీనిని అవకాశంగా తీసుకొని వ్యాపారులు మటన్, చేపల ధరలను పెంచారు. కిలో రూ.1000కి లభించే మటన్ ధర రూ.1200కి పెరిగింది. కొన్నిచోట్ల రూ.1100గా అమ్ముతున్నారు. అలాగే వివిధ రకాల చేపల ధరలు కూడా కిలోకు రూ.50 వరకు పెంచారు. ప్రస్తుతం నగరంలో వివాహాల వంటి శుభకార్యాలు జరుగుతున్నాయి. అన్నింటా కాకపోయినా కొన్ని శుభకార్యాలలో చికెన్‌తో భోజన ఏర్పాట్లు ఉంటాయి. అటువంటిచోట్ల చికెన్ బదులు మటన్ కూరలు వడ్డిస్తున్నారు.

విరామం.. ఉపయుక్తం!

▸ రోజు విడిచి రోజు టెన్త్ పరీక్షలు ▸ ప్రయోజనకరమంటున్న విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు



చిట్టివలస ఉన్నతపాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్త్ విద్యార్థులకు పరీక్షా కాలం 'వచ్చేస్తోంది. వచ్చేనెల 17నుంచి 31వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు దగ్గర పడే కొద్దీ వారిలో సహజంగానే ఒత్తిడి పెరుగుతుంది. విరామం, నిద్రాహారాలు మానేసి, రేయింబవళ్లు చదవడం పరిపాటిగా మారడంతో, ఏడాది పొడుగునా చదివినదంతా పరీక్ష రోజున రాయాల్సి వచ్చేసరికి అనేక మంది విద్యార్థులు మర్చిపోతుంటారు. దీంతో ఆశించిన స్థాయిలో మార్కులు లభించక నిరాశకు లోనవుతుంటారు.

పరీక్షల పట్ల భయం, ఆందోళన వీడాలి. సరిపడా నిద్ర, తేలిక పాటి ఆహారం సమతుల్యంగా తీసుకోవాలని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నప్పటికీ, ఆచరణకు వచ్చేసరికి విద్యార్థులకు వీలుగాని పరిస్థితి. అంతేకాక టెన్త్ పబ్లిక్ పరీక్షలు మొదలైన తర్వాత ప్రతి రోజూ ఏకధాటిగా పరీక్షలు ఉండడంతో, ఒక పరీక్ష రాసి వచ్చిన తర్వాత తీరిక, విరామం లేకుండా ఆ అలసట, ఒత్తిడితోనే తర్వాత రోజు పరీక్షకు చదువుతుంటారు. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచి పరీక్ష విధానంలో మార్పుతెచ్చి, ఈ దఫా రోజు విడిచి రోజు టెన్త్ పరీక్షలు నిర్వహించాలని బోర్డు, ప్రభుత్వం నిర్ణయించింది. తాజా నిర్ణయంతో పరీక్షల వేళ విరామం దొరుకుతుందనివిద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ విధానంలో విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి, ఉత్తీర్ణతా శాతంతోపాటు మార్కులు పెరుగుతాయనిపలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.విద్యాశాఖ చేసిన ఈ తరహా ప్రయోగం విద్యార్థులకు ప్రయోజనమేనని భావిస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న వేళ టెన్త్ విద్యార్థుల ప్రణాళికాబద్ధంగా టైంటేబుల్ రాసుకుని, దాన్ని అనుసరిస్తూ కష్టమైన సబ్జెక్టుకు ఎక్కువ సమయం కేటాయించి, చదవాలి. కష్టతరమైన చాప్టర్లను పక్కనపెట్టి, మిగిలిన వాటిపై దృష్టిపెట్టాలి. ప్రతిరోజూ ఉదయం లేవగానే ధ్యానం చేస్తే ప్రయోజనం.



**జయంతి రాధాకుమారి, హెచ్ఎం
జివిఎంసి హైస్కూల్, రాయిపాలెం, భీమిలి.**

ఉపయోగకరం

సాధారణ పరీక్షల కంటే పబ్లిక్ పరీక్షలు. ఎలాగూ ఒత్తిడి ఉండడం సహజం. పరీక్షకు, పరీక్షకు మధ్య ఒకరోజు వ్యవధి ఉంచేలా విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపయోగం.



**బి హేమలత, టెన్త్ విద్యార్థిని
జివిఎంసి హైస్కూల్, రాయిపాలెం, భీమిలి.**

ప్రతి నిమిషం విలువైనదే

పరీక్షల సమయంలో ప్రతి నిమిషం ఎంతో విలువైనది. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు ఒకటికి పదిసార్లు నెమరు వేసుకునేందుకు , సందేహాల నివృతికి సమయం దొరుకుతుంది.



**పి.ఈశ్వర్ సురేష్, టెన్త్ విద్యార్థి
జివిఎంసి హైస్కూల్, రాయిపాలెం,భీమిలి.**

భయం కాస్తా తగ్గింది

ఈ ఏడాది పరీక్షల షెడ్యూల్ చూసాక పరీక్షలపై ఉన్న కాసింత భయం వీడింది. సమయాభావం చిక్కడంతో ఆందోళనతో కాకుండా నిదానంగా సన్నద్ధతతో మంచి ఫలితాలు సాధిస్తాం. అందరిలోనూ ఇదే రకమైన విశ్వాసం కలుగుతోంది.



**ఎం సాయిశిరీష, టెన్త్ విద్యార్థిని,
జెడ్‌పి హైస్కూల్, చిట్టివలస**

27, 28 తేదీల్లో 'గీతం'లో శాస్త్రవేత్తల ప్రసంగాలు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎథోలజిస్ట్స్ అంతర్జాతీయ కార్యదర్శి ప్రొఫెసర్ రాఘవేంద్ర గడాగ్‌కర్ ఫిబ్రవరి 27,28 తేదీలలో వివిధ అంశాలపై ప్రసంగించనున్నారని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు. జాతీయ సైన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో 27న ప్రొఫెసర్ రాఘవేంద్ర 'డివిజన్ ఆఫ్ లేబర్ ఇన్ ద ఇండియన్ పేపర్ వాస్ప్' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. క్రిమికీటకాదులు, జంతువుల స్వభావాలపై పరిశోధనలు జరిపిన ఆయన 28న 'వార్ అండ్ పీస్ : కాన్‌ఫ్లిక్ట్ అండ్ కోఆపరేషన్ ఇన్ ఎ ట్రాపికల్ ఇన్‌సెక్ట్ సొసైటి' అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు.అదే రోజు మధ్యాహ్నం సైన్స్ ఫర్ ఆల్ అనే అంశంపై ప్రసంగం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మదర్ థెరిసా ఆడిటోరియంలో ఈ నెల 27,28తేదీల్లో ఉదయం 10గంటలకు శాస్త్రవేత్తల ప్రసంగాలకు ఆసక్తి గల పరిశోధకులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ఎవరైనా హాజరు కావచ్చునని సూచించారు.

రెల్లి కులాన్ని ఎస్‌సి (ఎ)గా పరిగణించాలి

ప్రజాశక్తి- ములగాడ: ఎస్‌సిల వర్గీకరణలో రెల్లి కులాన్ని 'ఎస్‌సి ఏ'లో చేర్చి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎపి రెల్లి కుల అభివృద్ధిసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొట్టాన రవి కోరారు. బుధవారం విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబును తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసిన రెల్లి కులసంఘం ప్రతినిదులు ఈ మేరకు విన్నవించి, వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రెల్లి కుల నాయకులు నీలాపు జోగి, ఇమిడిశెట్టి గోపి, ఇమిడిసెట్టి శ్రీకాంత్, పెద్దింటి రమేష్ ఉన్నారు.

పోర్టు ఆసుపత్రి పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ యోచనను వెనక్కు తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని పోర్టు ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాధరావు పిలుపునిచ్చారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న దీక్షలు బుధవారం 149వ రోజుకు చేరిన సందర్భంగా దీక్షా శిబిరంలో పాల్గొన్న త్రినాధరావు మాట్లాడుతూ, పోర్టు ఆసుపత్రి అభివృద్ధి కోసమే పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేస్తామన్న ప్రభుత్వమాటలు బూటకమన్నారు. వందల ఎకరాల భూములు, వేలకోట్ల రిజర్వ్ ఫండ్ ఆస్తులున్న విశాఖ పోర్టుకు ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు పిపిపికి అప్పగించాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.800కోట్లు నికర లాభాలను ఆర్జించిన విశాఖ పోర్టు, ఈ ఆసుపత్రి అభివృద్ధికి అంతమాత్రం నిధులు కేటాయించలేదాయని ప్రశ్నించారు. పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు ఆరోగ్యాలతో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, సొంత నిధులతో ఆసుపత్రి అభివృద్ధి, అవసరమైన వైద్యులు, సిబ్బందిని మందులను సమకూర్చి వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. పోర్టు ఆసుపత్రిని దక్కించుకునేందుకు టెండర్లంటూ ఎవరైనా వస్తే వారిని అడ్డుకుని తరిమికొట్టక తప్పదని హెచ్చరించారు. లేకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె. సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, నర్సింగరావు, శోభన్, రాజగోపాలరావు, సిహెచ్‌విఎస్.రెడ్డి, బి జగన్ పాల్గొన్నారు.



దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు నేత త్రినాధరావు

హెచ్‌డిఎఫ్‌సి కొత్త బీమా పాలసీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : దేశంలో ప్రముఖ జీవిత బీమా సంస్థలలో ఒకటైన హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్ 'క్లిక్ టు అచీవ్ ఫర్ అడ్వాంటేజ్' పేరుతో కొత్త బీమా పథకాన్ని బుధవారం ప్రారంభించింది. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో పథకాన్ని ప్రారంభించిన సంస్థ ప్రోడక్ట్ హెచ్ అనీష్‌ఖాన్ మాట్లాడుతూ, ఖాతాదారుల పొదుపులను పెంచుతూ, ముందస్తు లిక్విడిటీ కోసం ఫ్లెక్సిబిలిటీని అందిస్తూ భవిష్యత్తు ఆర్థికాభివృద్ధికి ఈ పథకం సహాయపడుతుందన్నారు. ఈ పథకం స్వల్ప కాలిక అవసరాలు తీర్చడంతో పాటు దీర్ఘకాలిక భద్రతను అందిస్తుందన్నారు. జీవిత బీమా చేసిన వ్యక్తి మరణిస్తే, భవిష్యత్తు ప్రీమియంలు మాఫీతోపాటు, డెత్ బెనిఫిట్ ఒకే మొత్తంలో వెంటనే నామినీకి చెల్లిస్తారన్నారు. ఈ పథకంలో చెల్లించాల్సిన నగదు, బోనస్‌ను పెయిడ్ అప్ అడిషన్‌గా మార్చుకుని, పాలసీ వ్యవధి కాలంలో ఎప్పుడైనా నగదు రూపంలో తీసుకోవచ్చున్నారు.

నేరాలు ఘోరాలు

నదిలో మునిగి యువకుడు మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో పెనుగొల్లు గ్రామంలో మహా శివరాత్రి రోజున విషాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెనుగొల్లు గ్రామానికి చెందిన పక్కుర్తి చరణ్ (20) తమ్ముడు, మేనమామ కొడుకులతో కలిసి సరదాగా వరహనదిలో స్నానానికి దిగారు. ఇద్దరు యువకులకు ఈత రాకపోవడంతో మునిగి పోతుండగా, అక్కడున్నవారు వారిలో ఒక యువకుడిని రక్షించారు. అయితే చరణ్ గల్లంతు కావడం స్థానికులు గాలించి ఆయనను వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరిన చరణ్‌ను హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల పరిశీలించిగా అప్పటికే మరణించినట్టు ధ్రువీకరించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెట్టు నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఎస్.రాయవరం : మండలంలో పెనుగొల్లు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిందడా శ్రీను (27) తన పొలంలో తాటిచెట్టు కొమ్ములు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందకు జారి పడిపడ్డాడు. స్థానికులు ఆయనను వెంటనే అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించగా, ప్రధమ చికిత్స అనంతరం ఆరోగ్యం విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం రిఫర్ చేయగా, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో ఓ చెట్టుకు యువకుడు ఉరివేసుకొని మృతి చెందాడు. వాకింగ్ వచ్చిన వాకర్స్ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నర్సీపట్నం టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని వివరాలు సేకరించారు. మృతదేహం సమీపంలోని బ్యాగులో గల ఆధార్ కార్డు చూసి అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం గ్రామానికి చెందిన పనసల చంద్రశేఖర్‌గా గుర్తించారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండోవార్డు గొల్లవీధికి చెందిన 21 ఏళ్ల యువతి ఈ నెల 25న అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం, జివిఎంసి రెండో వార్డు, గొల్లవీధికి చెందిన నక్కాన హేమ ఈ నెల 25న రాత్రి 7.45 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. తిరిగి రాలేదు.ఇంటర్ చదువుకున్న తన కుమార్తె అదృశ్యంపై ఆమె తల్లి చంద్రకళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని మామిడిలోవ పంచాయతీ సత్తరువు జంక్షన్ చెందిన మానుకొండ లక్ష్మి (71) భర్త చనిపోవడంతో తన సోదరి సాకూరి అరుణతో కలిసి సత్తెరవులో ఉంటున్నారు .ఈనెల 5 న ఉదయం తన అక్క మానుకొండ లక్ష్మి ఇంటి నుండి బయటికి వెళ్లిన లక్ష్మి తిరిగి రాలేదు. గతంలో ఇంటి నుండి వెళ్లి, ఐదు,పది రోజుల తర్వాత తిరిగి వచ్చేదని, అలాగని ఎదురుచూసి సమీప బంధువులు, కుటుంబం సభ్యులు, రెండు వారాలు దాటినా ఆచూకీ లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాఉ. వృద్ధురాలి సోదరి అరుణ ఫిర్యాదు మేరకు సీఐ చింత వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పి. శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు

సుందరయ్య కాలనీలో అన్నసమారాధన

ప్రజాశక్తి -గాజువాక : మహా శివరాత్రి సందర్భంగా జివిఎంసి 71వ వార్డు సుందరయ్యకాలనీ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం సుమారు మూడు వేలమంది భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు, వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు, జనసేన గాజువాక నియోజకవర్గం నాయకులు కరణం కనకరావు తదితరులు పాల్గొన్నారు .

ఈసారైనా పూర్తయ్యేనా..?

- ఎట్టకేలకు వడ్లపూడి ఆర్‌ఓబి పనుల్లో కదలిక
- చురుగ్గా సాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు,స్థానికులు
- ఈసారైనా నిరాటంకంగా పూర్తిచేయాలని ఆశాభావం



వడ్లపూడి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న పిల్లర్ల పనులు

ప్రజాశక్తి గాజువాక : కొన్నేళ్లుగా అర్ధాంతరంగా ఆగిపోయిన వడ్లపూడి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) నిర్మాణ పనుల్లో ఎట్టకేలకు మళ్లీ కదలిక వచ్చి, ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. గోపాలపట్నం వైపునుంచి స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టులకు సరుకులు తరలించేందుకు వీలుగా గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగించేందుకు ఉన్న రైల్వేట్రాక్‌పై చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ నుంచి ఆటోనగర్ ఎఫ్‌బ్లాక్‌వైపు ఉన్న రోడ్డు మార్గంలో రైల్వేగేటు వద్ద వాహనదారులు, ప్రజలు నిత్యం నానా యాతన పడుతున్నారు రైల్వేగేటు వేస్తే ఒక్కోసారి గంటకు పైగా పడిగాపులు పడాల్సిన దుస్థితిలో, ప్రజలు, వాహనదారుల కష్టాల నుంచి విముక్తికి ఇక్కడ రైల్వే ఫ్లైఓవర్ వంతెనను మంజూరు చేశారు.

ఎనిమిదేళ్ల క్రితం క్రితం వడ్లపూడి రైల్వేవ్యాగన్ వర్క్‌షాపు వద్ద రైల్వే ఫ్లైఓవర్ పనులు ప్రారంభించారు. రూ.13.82 కోట్లు వ్యయంతో 661 మీటర్ల పొడవైన రైల్వే పైవంతెన పనులకు శ్రీకారం చుట్టగా, కేవలం రైల్వే ట్రాక్‌పైనే వంతెన పనులు చేపట్టి, ఇరువైపులా వంతెనతోపాటు అప్రోచ్ రోడ్డు పనులు జరగలేదు తర్వాత పలుమార్లు దీనిపై వినతులు వెళ్లినప్పటికీ, అధికారులు, నేతల్లో ఎటువంటి కదలిక లేకపోవడంతో అటూఇటుగా 20గ్రామాల ప్రజలు, వాహనదారులు, ఈ మార్గంలో ప్రయాణించే వాళ్లంతా నిత్యం నానాయాతన పడుతున్నారు. అంతేకాక ఆటోనగర్‌లో పది బ్లాకులలో ఏర్పాటైన దాదాపు 1100 కంపెనీలకు వచ్చే వాహనదారులు, ఉద్యోగులు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. దీనిపై ఆటోనగర్ కంపెనీ యజమానులతో పాటు రెండువైపులా ఉన్న గ్రామాల ప్రజలు, వాహనదారులు ఎన్నోమార్లు అధికారులకు మొరపెట్టు కున్నారు .చివరకు ఈ వంతెన నిర్మాణం ఎన్నికల్లో ప్రచారాస్త్రంగానూ మారి పోయినా, ఇన్నాళ్లు హామీలే తప్ప పనుల్లో కదలిక లేకపోయింది. వడ్లపూడి రైల్వేట్రాక్ వద్ద గేటు వేసిన తర్వాత ఒక్కోసారి రెండు మూడు గూడ్స్ రైళ్లు వెళ్లేంత వరకు వేచియుండాల్సిన పరిస్థితుల్లో వాహనదారులు గంటలు తరబడి పడిగాపులు పడాల్సి వస్తోంది. ఇక్కడ ముందుకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయం లేని స్థితిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



రైల్వేగేటు వేయడంతో పడిగాపులు పడుతున్న వాహనదారులు

ఈ నేపథ్యంలో అసంపూర్తి ఈ వంతెనను పూర్తి చేసేందుకు ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో తాజాగా పనుల్లో కదలిక వచ్చింది. ఇక్కడి రైల్వే వంతెన నిర్మాణం పూర్తయితే గాజువాక ఆటోనగర్‌లో ఉన్న అన్ని పరిశ్రమలకు రాకపోకల కష్టాలు తీరుతాయని భావిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత పనులు ప్రారంభించడం, ప్రస్తుతానికి చురుగ్గా నిర్మాణం జరుగుతుండడంతో ఈసారి ఫ్లైఓవర్ వంతెన పూర్తవుతుందని ఆటోనగర్ పరిశ్రమల వాసులతోపాటు పాటు వాహనదారుల ఆశాభావంతో ఉన్నాయి. ప్రారంభమైన పనులు వంతెన నిర్మాణం పూర్తయి, రాకపోకలు సాగేవరకు నిరాటంకంగా జరగాలని అందరూ ఆశిస్తున్నారు.

నేడు సముద్ర స్నానాలకు ఏర్పాట్లు



భీమిలి బీచ్ చిల్డ్రన్స్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కర్రల బారికేడ్లు

ప్రజాశక్తి- భీమునిపట్నం : మహా శివరాత్రి జాగరణ చేసే భక్తులు మరుసటిరోజు ఆచరించే సముద్ర స్నానాలకు స్థానిక బీచ్‌లో జివిఎంసి ఒకటో జోన్ అధికారులు బుధవారం తగు ఏర్పాట్లు చేశారు. జోన్ పరిధిలోని 3, 4 వార్డులకు చెందిన భక్తులు సముద్రతీరంలో స్నానాలకు వచ్చే సమయంలో వారికి అవసరమైన ఏర్పాట్లుతోపాటు ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీరంలో కర్రలతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. మూడోవార్డు బీచ్ స్వాగతద్వారం, చిల్డ్ర న్స్ పార్కు, మంగమారిపేట వద్ద పొడవాటి బారికేడ్లను ఏర్పాటు చేశారు. 4వ వార్డు మంగమారిపేట వద్ద తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు ఎఇఇ సురేష్ తెలిపారు.

మూడో వార్డు పరిధిలో శాశ్వత టాయిలెట్లుఉన్నందున తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయలేదన్నారు. సముద్రస్నానాలు అనంతరం మహిళలు బట్టలు మార్చుకునేందుకు వీలుగా మంగమారిపేట, చేపలుప్పాడల్లో ఒక్కోచోట, భీమిలిలో స్వాగతద్వారంవద్ద రెండు చోట్ల తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా భారీ పోలీస్ బందోబస్తు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

విశాఖ మార్కెట్‌లో 'కామెట్ ఇవి బ్లాక్ స్టార్మ్' కార్లు



కామెట్ ఇవి బ్లాక్ స్టార్మ్ కారు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారత దేశపు ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ జెఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా లిమిటెడ్ కామెట్ ఈవి బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ వాహనాన్ని బుధవారం విశాఖ మార్కెట్లో విడుదల చేసింది.

బీచ్ రోడ్‌లోని ఎంజి మోటార్స్ షోరూమ్‌ల "కార్యక్రమంలో సంస్థ సేల్ హెడ్ రాకేష్ సేల్ మాట్లాడుతూ నూతన వాహనంలో నాలుగు ఫీచర్స్‌తోపాటు ఫాస్ట్ చార్జింగ్, 17.4 కిలోవాట్ బ్యాటరీ కలిగి ఉందని, ఒకసారి చార్జింగ్ చేస్తే 230 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుందని తెలిపారు విలక్షణమైన బ్యాచ్ వీల్ కవర్ హుడ్ బ్రాండింగ్ స్కిడ్ ప్లేట్స్ వంటి స్టైలిష్ అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.7.80 లక్షల నుండి ప్రారంభమవుతుందని, వెంటనే బుక్ చేసుకోవచ్చని సూచించారు. దగ్గరలోని ఎంజి మోటార్స్ షోరూమ్‌లో రూ.11వేలు చెల్లించి వాహనాన్ని బుక్ చేసుకోవాలని సూచించారు.

1న బాలికలకు కేన్సర్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆడపిల్లల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను నియంత్రించేందుకు మార్చి ఒకటిన ఓల్డ్‌టౌన్ కోటవీధిక్వీన్ మేరీ బాలికల పాఠశాలలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ తెలిపారు. సెర్విక్ క్యాన్సర్‌ను నియంత్రించడంలో భాగంగా విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన వ్యాక్సిన్‌ను బాలికలకు వేస్తామన్నారు. .లయన్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పోర్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు, లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్‌విబిఎస్ఎస్.ప్రసాద్, కెజిహెచ్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం. పాండురంగకుమారి, క్వీన్ మేరీ పాఠశాల హెడ్మాస్టర్ వి. జోగీంద్రనాథ్ లయన్స్ క్లబ్ కార్యదర్శి బి. రవిచంద్ర, కోశాధికారి హేమంత్ చౌదరి పాల్గొంటారన్నారు. క్వీన్ మేరీ పాఠశాల బాలికలకు మొదటిడోస్ వ్యాక్సినేషన్ చేయనున్నట్లు డాక్టర్ శిరీన్ రహమాన్ తెలిపారు.

ఇళ్ల స్థలాల పోరాటంలో దేవుడమ్మ పాత్ర కీలకం



దేవుడమ్మకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : దశమకొండలో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటంలో దేవుడమ్మ పాత్ర కీలకమైనదని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు అన్నారు.బుధవారం దేవుడమ్మ 10వ వర్ధంతి సభ దశమ కొండ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సభలో సిపిఎం కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ దశమకొండ ఇళ్ల స్థలాల పోరాటంలో ముందున్న దేవుడమ్మ, పేదల కోసం జైలుకు వెళ్లిందన్నారు. ప్రజల పట్ల కార్యకర్తల పట్ల నిబద్ధత కలిగిన ఆమె ఆశయసాధనకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రజా సమస్య లపై సిపిఎం పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి నర్సింగరావు, జోన్ కమిటీ సభ్యులు కె.సంతోషం అప్పారావు, కిరీటం, మంగ, జి లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగర పరిధిలోని సాయినగర్, దేశపాత్రునిపాలెంలో ఉన్న ఎర్రామ్స్ విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాలేజీ ప్రిన్సిపాల్ చక్రధర్ బహుమతులను అందజేశారు. .పర్యావరణ పరిరక్షణ అంశంపై పోటీలు నిర్వహించినట్లు స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఎల్లాజీ, వైస్ కరస్పాండెంట్ చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రత్నకుమారి, శివశంకర్, వాలంటీరు మానస, ప్రవల్లికపాల్గొన్నారు.

రేపు అశోక్‌కుమార్ ఉద్యోగ విరమణ

ఆత్మీయ వీడ్కోలు, సత్కారానికి పాఠశాలలో ముమ్మర ఏర్పాట్లు



కొల్లు అశోక్‌కుమార్, వెంకటరమణ దంపతులు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు కొల్లు అశోక్‌కుమార్ ఈనెల 28న శుక్రవారం విరమణ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికేందుకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

కొల్లు పెంచలయ్య, అన్నమ్మలకు నాలుగో సంతానంగా అశోక్ కుమార్ జన్మించారు. తండ్రి రైల్వేలో ఉద్యోగం, తల్లి నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సేవలు అందించారు. ఈ దంపతుల ఐదుగురి సంతానంలో ముగ్గురు అక్కలు లుంబినికుమారి, స్వర్ణలత, అమితల తర్వాత నాలుగోసంతానంగా. అశోక్ కుమార్ జన్మించారు. తమ్ముడు భీమారావు ఉన్నారు.

అశోక్‌కుమార్ తండ్రి పెంచలయ్య నెల్లూరు స్వస్థలం అయినప్పటికీ, ఉద్యోగరీత్యా 1955లో విశాఖపట్నం. వచ్చేశారు. అందువల్ల విశాఖపట్నంలోనే జన్మించిన అశోక్ కుమార్ రైల్వే ప్రైమరీ స్కూల్లో 1972 నుంచి77 వరకు ఒకటి నుంచి ఐదో తరగతి పూర్తి చేశారు. రైల్వే కాలనీలో ప్రభుత్వ రైల్వే స్కూల్లో 1977 నుండి 82 వరకు ఆరవ తరగతి నుంచి 10వ తరగతి పూర్తి చేశారు. 1982 –84 బివికె జూనియర్ కళాశాలలో ఇంటర్, తర్వాత ప్రభుత్వ విఎస్ కృష్ణ కాలేజీలో 1984– 87లో బిఎస్‌సి (బిజెడ్‌సి)డిగ్రీ పూర్తి చేశారు. 1987–88లో ఏలూరు సిఆర్‌ఆర్ కళాశాలలో బిఇడి పూర్తిచేసిన తర్వాత 1992లో ఎంఎ ఆంధ్ర యూనివర్సిటీలో పూర్తి చేశారు, 1990 ఫిబ్రవరి 28న పరవాడ మండలం లంకెలపాలెం దరి గొల్లపేట ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్, 1998 ఆగస్టు వరకు అక్కడే పనిచేశారు. 1998 నుంచి 2003 వరకు అదే మండలంలోని గొన్నవాని పాలెం ఎంపిపి స్కూల్‌లోనూ, 2003 జూన్ 26న ప్రమోషన్‌పై చీడికాడ మండలం అప్పలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా చేరి, 2009 వరకు పనిచేశారు. అక్కడనుండి ఆనందపురం మండలం బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ 2017 వరకు,. 2017 నుంచి 2025 వరకు పద్మనాభం మండలం మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగకాలం పూర్తికావడంతో ఈనెల 28న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 1995 ఫిబ్రవరి 19న నర్సీపట్నానికి చెందిన చింతకాయల సాంబమూర్తి, సన్యాసమ్మల కుమార్తె, బిఇడిలో తన క్లాస్‌మేట్ వెంకటరమణను పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక్కరే కుమార్తె కొల్లు శ్రీహృదయ కాగా, ఆమె ఆంధ్ర యూనివర్సిటీలో డాక్టర్ ఇన్ ఫార్మసీ పూర్తి చేసి, విజయనగరం జిల్లా బొబ్బిలిలో గోకుల ఫార్మసీ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అశోక్‌కుమార్ పుస్తకాలు చదవడం. బాల గేయాలు రాయడం, పాటలు పాడటం, పెరట్లో పూల మొక్కలు పెంచటం, కరాటే ఇంకా ఎన్నో హాబీలు ఉన్నాయి.

ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ పోలింగు అధికారులను ఆదేశించారు. స్థానిక జివిఎంసి హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగు సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సిబ్బంది అందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఎంతో విలువైనవని, ఎన్నికల ప్రక్రియలో సిబ్బంది సేవలు చాలా ముఖ్యమని తెలిపారు. ఎన్నికల సామగ్రి తీసుకున్న సిబ్బంది తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఓటర్లందరూ చదువుకున్నవారేనని, ఓటింగు పట్ల అవగాహన కలిగినవారేనని, అందువల్ల ఎటువంటి ఇబ్బందులు రావని, సిబ్బంది అందరూ సమన్వయంతో పోలింగు విధులు నిర్వహించాలని కలెక్టరు కోరారు. పోలింగు సిబ్బంది పోలింగు కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగు సిబ్బందికి కావలసిన భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పోలింగు అనంతరం జివిఎంసి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షను సెంటరులో బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ జాగ్రత్తగా అందజేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన అధికారులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగు సామగ్రినిస్థానిక జివిఎంసి హైస్కూల్‌లో బుధవారం జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు పర్యవేక్షణలో పంపిణీ చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ కొరకు 10 కౌంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగు ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్ని నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో లోపల, బయట 2 వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలింగ్ ప్రక్రియ అంతటిని వెబ్ కాస్టింగ్ చేసి, దీనిని పర్యవేక్షించుటకు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం రిపోర్ట్ తీసుకొనుటకు గాను కలెక్టరు కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. 24 పోలింగ్ కేంద్రాలకు 10 సెక్టార్ ఆఫీసర్లు, 10 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ఓటర్లు తమ ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు మంచినీరు, ఎండ తగులకుండా టెంట్లు ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో అనకాపల్లి, నర్సీపట్నం రెవిన్యూ డివిజినల్ అధికారులు షేక్ ఆయిషా, వివి.రమణ, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బివి.రాణి, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, తహశీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన ఎన్నికల అధికారులు


పంపిణీ చేసిన మెటీరియల్ చూపుతున్న విద్యార్థినులు

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు 98 మందికి రానున్న పరీక్షలకు అవసరమైన పరీక్ష మెటీరియల్‌ను దేవరాపల్లికి చెందిన వరదపురెడ్డి కౌశిక్ నాయుడు, హేమచంద్ర, చంద్రరావు, గౌరీ దంపతులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి విద్యాలయానికి, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కెవి రమణ, మండల అధ్యక్షులు కొరుపోలు శ్రీను, గంగవంశం సంతోష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు సిహెచ్.రవిశంకర్, కోరుకొండ పెంటారావు, విద్యాలయం ప్రత్యేక అధికారి సిహెచ్.భువనమాధురి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


వెంకన్న ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మిస్తాం : ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామ పెద్దలు, అనువంశిక ధర్మకర్తల ఏకాభిప్రాయంతో కళ్యాణ మండపాన్ని నిర్మిస్తామని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు మరోసారి హామీ ఇచ్చారు. వడ్డాదిలో వెంకటేశ్వరస్వామి 152వ వార్షిక కళ్యాణోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు కారణంగా ఏకాభిప్రాయం లేనందువలన కల్యాణ మండపం నిర్మాణం నిలిచిపోయిందని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ దఫా కచ్చితంగా కళ్యాణ మండపాన్ని కట్టి తీరుతామని చెప్పారు. వెంకన్న ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.

వెంకన్న కల్యాణరాట మహోత్సవం

వడ్డాది గిరిజాంబ గిరిపై ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి 152వ వార్షిక కళ్యాణోత్సవాలకు మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కళ్యాణరాట ప్రతిష్ఠించారు. అర్చకులు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు, వారి అన్న కుమారుడు దొండా శ్రీరామ్ శాస్త్రోక్తంగా పూజలు జరిపి కళ్యాణరాట వేశారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యేని ధర్మకర్త ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మకర్త కన్నబాబు మాట్లాడుతూ మార్చి 9వ తేదీ రాత్రి స్వామివారి దొంగ పెళ్లితో ఉత్సవాలు ప్రారంభమై 15వ తేదీ పుష్పాంజలి సేవతో ముగుస్తాయని తెలిపారు. 10న స్వామివారి కళ్యాణం, 14న నాగవల్లి వసంతోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. శివరాత్రి నుండి ఉత్సవ ఏర్పాట్లు ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే రాజు గ్రామ పెద్దల సహకారంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ డి.నాగేశ్వరి దేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి కూటమి నాయకులు దొండా సన్యాసిరావు, నరేష్, అడపా నరసింహమూర్తి, జి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ దాడి గోవింద, దొండా నరేష్, దొండా నానాజీ, ధర్మతేజ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల యంత్రాంగం

- నేడు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్


భీమిలి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ సుధాకర్

ప్రజాశక్తి - భీమునిపట్నం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఎంఎఫ్‌సి యుపి స్కూల్‌లో 123 పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ భాస్కర రావు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో 261మంది ఓటర్లులో పురుషులు 157 మంది, మహిళలు 104 మంది ఉన్నారు. పోలింగ్ నిర్వహణకు పిఒ, ఎపిఒ, ఒపిఒలు ముగ్గురు మొత్తంగా ఐదుగురు సిబ్బంది విధుల్లో ఉంటారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది.

14 మందితో పోలీస్ బందోబస్తు

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహణకు 14 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ బి సుధాకర్ తెలిపారు. బుధవారం పోలింగ్ కేంద్రాన్ని ఎఎస్ఐ సత్తిబాబు, హెడ్ కానిస్టేబుల్ అప్పలరాజు కలిసి పరిశీలించారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.. సిఐ, ఎస్ఐ, ఎఎస్ఐ, ముగ్గురు హెచ్‌సిలు, 8 మంది పోలీస్ కానిస్టేబుళ్లతో బందోబస్తు ఉంటుందని తెలిపారు.

పద్మనాభం : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని నార్త్ ఎసిపి ఎస్ అప్పలరాజు బుధవారం పరిశీలించారు. ఎన్నికలు సజావుగా నిర్వహణకు పటిష్టబందోబస్తు కల్పించాలని ఎస్ఐ సురేష్‌కు ఆదేశించారు. పోలింగ్‌యంత్రాంగం ఇప్పటికే కేంద్రానికి చేరుకోగా, ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆనందపురం : ఆనందపురం ఎంపియుపి పాఠశాల కేంద్రం (122)లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ కేంద్రంలో 44మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనునానరని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన ఏదోఒక గుర్తింకార్డుతో వచ్చి ఓటేయాలని ఉపాధ్యాయ ఓటర్లను కోరారు. 18మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని తెలిపారు.

నక్కపలి : ఈనెల 27 బుధవారం జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 101 పోలింగ్ బూత్ ను ఏర్పాటు చేశారు.52 మంది ఓటర్లు ఉన్నారు. మంగళవారం పోలింగ్ స్టాఫ్ హాజరయ్యారు. ఆర్ఐ కన్నబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


నక్కపల్లి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న పోలింగ్ అధికారులు

కోటవురట్ల : టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పోలింగ్ కేంద్రానికి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు తహసిల్దారు తిరుమల బాబు అన్నారు. సిబ్బందికి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం నెంబర్ 98లో 81 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ అధికారి గోపీనాథరావు మాట్లాడుతూ, ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే పోలింగ్లో మహిళలు 25 మంది పురుషులు 56 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సిబ్బంది సామాగ్రితో పాటు బుధవారం సాయంత్రం మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ ఎన్నికలకు జిల్లా పరిషత్ హైస్కూల్లో బూత్ నెంబర్ 92 ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 52 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు.


బుచ్చయ్యపేట పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల అధికారులు

బుచ్చయ్యపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుచ్చయ్యపేట పోలింగ్ కేందానికి పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం చేరుకున్నారు. గురువారం జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. బుచ్చయ్యపేట పోలింగ్ కేంద్రంలో 34 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు.

రసవత్తరంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం



ఎడ్లు పరుగు పందెం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని మొగలిపురం శివారు శ్రీవీరాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి ఎడ్ల పందెం పోటీలు రసవత్తారంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతగా నక్కపల్లి సోమలమ్మ తల్లి, ద్వితీయ స్థానంలో అజనగిరి పరవాడ నాయుడు, తృతీయ స్థానంలో నరసయ్యపేట ముమ్మన కనకరాజు, నాలుగో స్థానంలో న క్క వా ని పా లె ం శ్రీపైడితల్లమ్మ, ఐదో స్థానంలో శ్రీజాపురం శ్రీఆంజనేయ, ఆరవ స్థానంలో నరసాపురం నరసంగి యాదవ్‌కు చెందిన ఎడ్లు నిలిచాయి. ఈ కార్యక్రమానికి పెందుర్తి నియోజవర్గం వైసిపి నాయకులు గండి రవికుమార్, మాజీ ఎంపీపీ గండి దేముడు ముఖ్య అతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.8వేలు, నాలుగో బహుమతి రూ.6వేలు, ఐదో బహుమతి రూ.4వేలు, ఆరో బహుమతి రూ.2 వేలు, స్పెషల్ బహుమతులు వెయ్యి రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న పంచకర్ల

మండలంలోని మొగలిపురం శివారులో నూతనంగా నిర్మించిన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మొగలిపురం జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అనంతరం అన్న సమరాధనలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తమరాన సత్యనారాయణ, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, మిడతాడా మహాలక్ష్మి నాయుడు, తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, మామిడి శంకర్రావు, బంతి కోళ్ల పద్మ, పెద్దాడ రమణమ్మ, గొర్లి రాము నాయుడు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం జరగనున్న ఉమ్మడి శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



వైసిపి నేత భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భరత్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. భరత్‌కుమార్ ఆదేశాలు మేరకు వైసిపి అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులుగా పెద్దిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, అనకాపల్లి జిల్లా ఐటీ వింగ్ ప్రెసిడెంట్‌గా పల్లెల సాయి కిరణ్, బూత్ కమిటీల అధ్యక్షులుగా కరణం సురేష్ నియమితులయ్యారు. వారు బుధవారం అనకాపల్లి రింగ్ రోడ్డు వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో భరత్ కుమార్ని శాలువాతో, సత్కరించి మెమోంటో అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన భవాని స్వీట్స్ అధినేత గవర అప్పారావు కుమారులు గవర ప్రకాష్, జగదీష్‌లు రూ.50,116 విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్, జగదీష్‌లకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఓపెన్ స్కూల్ ఇంటర్ హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : మార్చి మూడో తేదీ నుండి జరుగనున్న ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పొందవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేదంటే విద్యార్థులు సంబంధిత స్టడీ సెంటర్ల నుంచి అభ్యాసకులు నేరుగా పొందవచ్చునని పేర్కొన్నారు. అభ్యాసకుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల హాల్ టికెట్లను ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారి అధికారిక వెబ్‌సైట్ www.apopenschool.ap.gov.in లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్సైట్ ద్వారా కూడా డౌన్లోడ్ చేసుకొనవచ్చునని తెలిపారు.

శ్మశానవాటికలో శివుని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బంగారయ్యపేట గ్రామంలో శ్మశాన వాటికలో శివుని విగ్రహాన్ని బుధవారం గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. కీర్తిశేషులు మదిని గోవింద పేరుతో శివుని విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శివుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బంగారమ్మ పేట గ్రామస్తులు

ఘనంగా దేములమ్మ తీర్థ మహోత్సవం

వడి చింతల కల్లాల వద్ద ఎడ్ల పరుగు పందెం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లి వీర బ్రహ్మంగారి గుడి, శ్రీరాపురం, తగరంపూడి వారి కల్లాలులో, రైవాడ రోడ్డు దగ్గర కొల్లి వారి కల్లాలు, వడి చింతల కల్లాలు తదితర ప్రాంతాల్లో బుధవారం దేములమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ తీర్థాన్ని పురస్కరించుకొని వడి చింతల కల్లాలు వద్ద ఎడ్ల పరుగు పందెం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కమిటీ సభ్యులు చేతులు మీదుగా నగదు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఇందులో మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి సీనియర్ నాయకులు, శరకాన సూర్యనారాయణ, మిడతాడ శ్రీనివాసరావు, బండారు అప్పలనాయుడు, గుల్లిపల్లి దేవుళ్ళు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎడ్లు పరుగు ప్రదర్శనను ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు

మామిడి, జీడి మామిడి సస్య రక్షణకు చర్యలు చేపట్టాలి

ఉద్యానవన శాఖాధికారి కిరణ్మయి

ప్రజాశక్తి-సబ్బవరం



మామిడి, జీడి మామిడి తోటలు పూత, పిందె సమయంలో అనేక రకాల పురుగులు, తెగులు ఆశించడం వలన దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని, సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని స్థానిక ఉద్యానవన శాఖ అధికారి ఆర్.కిరణ్మయి అన్నారు. ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ మండలంలో మామిడి సాగు విస్తీర్ణం 1011.92 ఎకరాలు, జీడి మామిడి సాగు విస్తీర్ణం 868.91 ఎకరాలు ఉందని తెలిపారు. మామిడి, జీడి మామిడి పూతలు డిసెంబర్ నెలలో రావాల్సి ఉండగా ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో పూతలు వచ్చాయని పేర్కొన్నారు. మామిడిలో ప్రధానంగా తేనె మంచు పురుగులు, తామర పురుగులు, కాయ తొలుచు పురుగులు, ఆకుమచ్చ, బూడిద తెగులు, జీడి మామిడిలో ప్రధానంగా టీ దోమ, ఎర్రనల్లి, కాండం తొలచు పురుగు, పూతమాడు తెగులు, బూడిద తెగులు మొదలైన తెగుళ్లు ఉంటాయని చెప్పారు. రైతులు సకాలంలో మందులు పిచికారీ చేసినట్లయితే అధిక దిగుబడులతో పాటు కాయ/పిక్క దిగుబడులను పెంచుకొని అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో మొదటి దశలోనూ, జనవరి రెండో వారంలో రెండో దశలోనూ మందులు పిచికారీ చేయాల్సి ఉందని చెప్పారు. ఇప్పుడు మూడో దశ పిచికారీ (పిందె / పిక్క బటాని సైజు తర్వాత అవసరం అయితేనే) లో లామిడా సైలోత్రిన్ ఒక మిల్లీలీటర్ లేదా పెగాసెస్ ఒక గ్రాము లేదా సైఫర్ మెత్రిన్ ఒక మిల్లీలీటర్, మరియు రిడోమిల్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాయ/ పిక్క సైజు పెరగడానికి పూత అంతా పిందె దశకు చేరిన తర్వాత 19.19.19 ఎరువు 10 గ్రాములు ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ విధంగా సకాలంలో పురుగుమందులు సిఫారసు చేయబడిన మోతాదులలో వాడి పోషకాలు కూడా అందినట్లయితే మామిడి, జీడి మామిడి తోటలలో పురుగు తెగుళ్ళ వల్ల పోషక లోపాల వల్ల కలిగే నష్టాలను అధిగమించవచ్చునని ఉద్యానవన అధికారి కిరణ్మయి తెలిపారు.



పిందె దశలో ఉన్న మామిడి

ఎల్‌బిపి అగ్రహారంలో పూరిల్లు దగ్ధం

- రూ.2.50 లక్షల మేరకు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం ఎల్బిపి అగ్రహారం గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిల్లు దగ్ధమైంది. రూ.2.50 లక్షల మేరకు ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన సానబోయిన అప్పారావు పూరింటిలో కొన్నేళ్లుగా నివసిస్తున్నాడు. బుధవారం తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాలయి. వెంటనే స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంటిలో ఉన్న నిత్యవసర వస్తువులు, బట్టలు, గృహోపకరణాలతో పాటు రూ.40 వేలు నగదు, విలువైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రెండు లక్షల 50 వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. అప్పారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కట్టుబట్టలతో అప్పారావు కుటుంబం రోడ్డున పడింది. బాధితులను మాజీ సర్పంచ్ తమరణ దాసు, ఎంపీటీసీ ఎల్లపు జగ్గారావు, దొండ శ్రీను, సాయం శేష తదితరులు పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు



కొత్తకోట కల్యాణపులోవలో భక్తుల సందోహం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కళ్యాణపులోవ పోతురాజుబాబు, పెద్దింటమ్మ తిరుణాళ్లు అర కోర వసుతుల మధ్య బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.తొలి రోజు గత ఏడాది కన్నా అధిక సంఖ్యలో భక్తుల తరలి రావడంతో ఆలయ ప్రాంగణం తో పాటు స్నాన ఘట్టాలు వద్ద రద్దీ ఏర్పడింది. ప్రతి ఏటా నిర్వహించే అన్న ప్రసాదం సరఫరా కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ కారణం గా నిర్వహించక పోవడం తో సుదూర ప్రాంతాల నుంచి చిన్న పిల్లలతో వచ్చిన భక్తులు ఆకలితో అలమటించారు.ద్విచక్ర వాహనాలు వేలాదిగా రావడంతో సుమారు రెండు గంటల సేపు ట్రాఫిక్ కి అంతరాయం ఏర్పడింది. కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ ట్రాఫిక్ క్లియర్ చేయించారు. సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 350మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు. నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలు దొండపూడి చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రాంతాలలో వాహనాలు నిలుపు చేయించారు. తొలి రోజు స్వామి వారిని జిల్లా క్రైమ్ ఏఎస్పీ ఎల్ మోహన రావు, నర్సీపట్నం ఆర్డీవో వివి రమణ, తదితరులు దర్శించుకున్నారు...

డిసిసిబి సిఈవో వి వి ఎస్ వర్మ, జనరల్ మేనేజర్ శ్రీనువాసరావు, డిజిఎం అశోక్ కుమార్, రామకృష్ణ, దుర్గా ప్రసాద్, కిషోర్ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగు నీరు ఉచితంగా సరఫరా చేశారు.

కశింకోట :మహాశివరాత్రి సందర్భంగా వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఆయన సోదరుడు మలసాల కుమార్ రాజా కశింకోట మండలంలోని తమ స్వగ్రామం ఎఎస్.పేటలో ఉమాసోమలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగ్గినిపాలెం, సోమవరం, కన్నూరుపాలెం, తాళ్ళపాలెం సంత, బంగారయ్యపేట భక్తులు పూజలు చేశారు.

మునగపాక : మండలంలోని నాగులపల్లి రామలింగేశ్వర ఆలయం, వెంకటాపురం నీలకంటేశ్వర ఆలయం, స్థానిక సాంబమూర్తి, పాలేశ్వర భీమేశ్వర, కాశీ విశ్వేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామిని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, హరిపాలెం హరిగిరి ఉన్న ఉమా పార్థివలింగేశ్వర స్వామి వారిని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కె.కోటపాడు : మండలంలోని కె.కోటపాడు, సింగన్న దొరపాలెం, చంద్రయ్య పేట, చౌడువాడ గ్రామాల్లోని శివాలయాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు. కె.కోటపాడులో అన్నదానాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నూకల లక్ష్మీ నరసింహమూర్తి, సర్పంచ్ యర్రంశెట్టి భవాని గురయ్య, కూటమి పార్టీ నాయకులు శరగడం సన్యాసినాయుడు సూరిశెట్టి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, నీలకంఠాపురం, రాజాం, సీతయ్యపేట పంగిడి ఆలయాల్లో ఉదయం నుండి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతవానిపాలెం పోతురాజు బాబు గుడి వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారుమెట్ట పరిసర శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివ రాత్రిని పురస్కరించుకొని అన్న సంబరాధన ఏర్పాటు చేశారు.

సబ్బవరం : లింగాల తిరుగుడు శ్రీసోమలింగేశ్వర స్వామి ఆలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పూజలు అభిషేకాలు చేశారు. కూటమి నాయకులు గొర్లి నాయుడు, స్థానిక నాయకులు దాడి శివ, దొడ్డి సూర్య ప్రకాష్‌రావు, ఎంపీటీసీ శరగడం ఝాన్సీ లక్ష్మిరాణి రాము, ఇందల రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : పట్టణంలోని శ్రీకాశీ విశ్వనాథ ఆలయం, గవరపాలెం శ్రీ భోగ లింగేశ్వర స్వామి, శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి, శారదా నది ఒడ్డున ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి, తుమ్మపాల సోమనాథ్ ఆలయంతోపాటు పలు ఆలయాల్లో భక్తులు పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీభోగలింగేశ్వర స్వామి, శ్రీసిద్ధి లింగేశ్వర స్వామి ఆలయాల్లో సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు చేశారు.

అచ్యుతాపురం :తంతడి, పూడిమడక సముద్రతీరాలలో భక్తులు స్నానాలు చేసి జాగారం పాటించారు. దూసూరు, మడుతూరు, కొండకర్ల, పెదపాడు, హరిపాలెం శివాలయాలలో భక్తులు పూజలు చేశారు. మడుతూరులో అన్న సమారాధన నిర్వహించారు. హరిపాలెం ఆలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, దుప్పుతురు ఆలయంలో ఏపీ రాష్ట్ర రహదారుల అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రత్యేకమైన పూజలు చేశారు.

-నక్కపల్లి:మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఉపమాక శివాలయంలో బుధవారం తెల్లవారుజాము నుండి భక్తులు బారులు తీరారు. పలువురు దాతల సహాయంతో భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. గొడిచెర్లలో శేష లింగేశ్వర స్వామి ,పాటిమీద శివాలయంలో భక్తులు బారులు తీరారు. గొడిచెర్లలో శేష లింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను ఎంపీడీవో డి సీతారామరాజు పర్యవేక్షించారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా శైవ క్షేత్రాలు కిటకిట లాడాయి. మండల కేంద్రంలో శ్రీవిద్వాన్ పాఠశాల వద్ద అభిషేకాలు వేద పఠనం నిర్వహించారు. కోటవురట్ల, జల్లూరు, పాములవాక, శివాలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేశారు. తహసిల్దారు తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డిటి రమేష్ పాల్గొన్నారు పందూరు, రాజుపేట, సుంకపూరు, వెంకటాపురం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గొలుగొండ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దారమఠం శివాలయం భక్తులతో పోటెత్తింది. ఉమాదార మల్లేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధారమఠం శివాలయానికి ఆర్టీసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. ఏఎల్.పురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దారమఠంలోని ఉమాధారమల్లేశ్వరస్వామిని డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తరవాహిని నదీ ఒడ్డున త్రిశూల పర్వంపై బ్రహ్మలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. ఉత్తరవాహిని నదీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్తరవాహిని సమీపంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మాడుగుల :మాడుగులలో ఉబ్బలింగేశ్వర, ఉమా భీమలింగేశ్వర, శ్రీ కృష్ణ భూపాలేశ్వర స్వామి, స్వర్గ లింగేశ్వర, శివగంగా ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

మధురవాడ : మధురవాడ కూడలిలోని శివాలయం, మిథిలాపురి వుడకాలనీ భోగలింగేశ్వర ఆలయం, కారుషెడ్ కూడలి ఉమాలింగేశ్వర ఆలయం, పిఎంపాలెం ఆఖరి బస్‌స్టాప్ వద్దనున్న శివాలయంలో మహాశివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి.

పెందుర్తి : నాయుడుతోట, వేపగుంట, పురుషోత్తపురం, పెందుర్తి తదితర ప్రాంతాల్లో ఉమామహేశ్వర నీలకంఠేశ్వర శివాలయాలు, నరవలోని ఉమానాగ లింగేశ్వర ఆలయం, సరిపల్లి శివాలయంలో భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలో ప్రత్యేక పూజలతోపాటు కొన్నిచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

అరిలోవ : ఆరిలోవలోని పెదగదిలి, డైవర్స్ కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాలలో శివాలయాలలో మహాశివరాత్రిని పురస్కరించుకొని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆనందపురం : మండలంలోని ఆనందపురం, బోని, గుడిలోవ, కుసుడవాడ, గిడిజాల తదితర గ్రామాలలో శివాలయాల్లో మహాశివరాత్రి శోభ కనిపించింది. పెద్దసంఖ్యలో భక్తులు దర్శనాలకురాగా, ఆలయ కమిటీలు తగు ఏర్పాట్లు చేశారు. బోని గ్రామంలో అమరేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. బోని,రాణిపేట, ఎస్సి కాలనీ, పరిసర గ్రామాల భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగర వ్యాప్తంగా ఉన్న శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓల్డ్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరువలో ఉన్న శ్రీ భీమలింగేశ్వర ఆలయం, దసపల్లా హోటల్‌ను అనుకొని ఉన్న విశ్వేశ్వర స్వామి ఆలయాలకు తాకిడి పెరిగింది. సింగ్ హోటల్ జంక్షన్‌లోని ఓంకార ఆలయం, పోలీస్ బ్యారెక్స్‌లోని ఉమా రామలింగేశ్వర స్వామి, అస్సాం గార్డెన్స్‌లోని శివరామకృష్ణ, బీచ్ రోడ్డులోని కోటేశ్వరాలయం రైల్వే న్యూ కాలనీలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు దొండపర్తిలోని ఎరుకుమాంబ ఆలయం, అస్సాం గార్డెన్స్ జంక్షన్‌లోని శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయాలకు భక్తులు వేల సంఖ్యలో హాజరై అభిషేకాలు నిర్వహించారు.



నగదు అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కొత్తకోట:ఇటీవల రోడ్డు ప్రమాదం లో గాయపడిన ఆటో డ్రైవర్ కుటుంబానికి కొత్తకోట శ్రీ శాంతి ఆటో యూనియన్ సభ్యులు రూ.5 వేల 116ల ఆర్థిక సాయన్ని బుధవారం అందజేశారు. శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యుడు రోలుగుంట మండలం జె. నాయుడుపాలెం గ్రామానికి చెందిన మరిసా బాబులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి గురైయ్యాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ బాబులు కుడి కాలుకు తీవ్ర గాయమైంది. ఆటో యూనియన్ సభ్యులు నగదును సమకూర్చి అందజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బుల్లిబాబు, టి.శేఖర్, నాగు, సత్తిబాబు, అప్పారావు, నాయుడు, పెంటయ్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా శ్రీవిద్వాన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో శ్రీ విద్వాన్ ప్రైవేట్ పాఠశాలో 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సిబ్బందికి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, మాజీ సర్పంచ్ దాసరి వెంకటరావు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్ల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో కోట గరువు వద్ద మంగళవారం రాత్రి సమయంలో రెండు విద్యుత్ వ్యవసాయ పంపుసెట్లు చోరీకి దొంగలు పాల్పడ్డారు. వీటి విలువ సుమారు 70 వేలు ఉంటుందని రైతులు తెలిపారు.దీంతో రైతు వేగి శంకరరావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ వ్యవసాయ పంప్ మోటర్లు చోరీకి గురవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ కార్యాలయంలో సైతం పంపు సెట్లు చోరీకి గురయ్యాయి. చోరీలు జరగకుండా పోలీసులు తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సి పాలిటీ పెద్ద చెరువు వద్ద గల కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ ఆలయం వద్ద కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ అన్నదాన క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మహాశివ రాత్రిని పురస్కరించుకొని 1500 మందికి అన్నసమారాధన కార్య క్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్ చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర హాజరై స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, ట్రస్ట్‌కు అవసరమైన సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన వెలగా నారాయణరావు, జనసేన నాయకులు లోకారపు అప్పారావు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వడ్డిస్తున్న నాయకులు



వృథాగా పోతున్న తాగునీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మేజర్ పంచాయతీ మెయిన్ రోడ్ వీధుల్లో ఇంటింటికి అందిస్తున్న తాగునీటి కొళాయిల నుంచి నీరు వృధాగా పోతున్నా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రంలో తాగునీరు కొళాయి నుంచి వృథాగా పోతుంది. పంచాయతీ కేంద్రంలోని ముట్టా దారి మెయిన్ రోడ్డులో అధికారులు కొళాయికి ట్యాపులు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పలు ఆలయాలకు విరాళాలు

ప్రజాశక్తి-మాడుగుల:జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బ మహేష్ పుట్టినరోజు సందర్భంగా మాడుగుల బస్టాండ్ ఆవరణలో దేవి తల్లి ఆలయ గోపురం నిర్మాణానికి పది వేల రూపాయలు నగదును, అలాగే మాడుగుల నుండి సాగరం వెళ్లే రహదారిలో మామిడి వారి కల్లాల వద్ద ఉన్న పోతురాజు బాబు ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా జరుగుతున్న అన్న సమారాధనకు 5 వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల టౌన్ జనసేన నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పంచలోహ తలుపులు వితరణ

మాడుగుల :మండలంలోని ఎం.కోడూరులో మోదకొండమ్మ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన గోకాడ కొండబాబు కుమారులు గంగరాజు, కొండలరావు, అలాగే అప్పాన వరాహమూర్తి కుమారులు రమణ బాబు,చిన్నం నాయుడులు రూ. 40 వేల విలువగల పంచలోహాల తలుపులను చేయించి బుధవారం ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, ముమ్మిన రమణ బాబు,రాయపరెడ్డి కొండలరావు, మజ్జి మహేష్ పాల్గొన్నారు.



విరాళాలు అందజేస్తున్న దాతలు


పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

ఇసుక అక్రమ రవాణాపై దాడులు

ప్రజాశక్తి -కోటవురట్ల:కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం ద్వారా అక్రమ ఇసుక రవాణా జరగకుండా రెవిన్యూ అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా అక్రమ రవాణా ఆగలేదు. దీంతో రెవెన్యూ అధికారులు బుధవారం వరాహ నదిలో గొట్టువాడ ప్రాంతంలో నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపట్టడంతో తహసీల్దార్ తిరుమలబాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆరు ట్రాక్టర్లను, రెండు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేపడితే చర్యలు తప్పవన్నారు. జల వనరులు భూగర్భ శాఖ అధికారులు ఇసుక తవ్వకానికి అనువైన ప్రదేశం కాదని, ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భ జలాలు అంతరించుకుపోయే అవకాశం ఉన్నందున ఎవరికి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. పట్టుబడ్డ వాహనాలకు నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న సివి కుమార స్వామి

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో మత్స్యకారుల కులదైవం నూకతాత జాతరను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం సివి కుమార స్వామి, ఎస్ఐ సన్ని బాబు గ్రామానికి వెళ్లి జాతర ఏర్పాట్లను పరిశీలించారు.కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో ఏర్పాట్లపై చర్చించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీరాలను పరిశీలించారు. తీరం వద్ద కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

మన్యంలో అరుదైన లక్ష్మణ ఫలం

-సాగు చేస్తున్న గిరిజన రైతు

-వివిధ రకాల కేన్సర్లకు దివ్య ఔషధం

ప్రజాశక్తి -చింతపల్లి:అంతర్జాతీయ పళ్ల మార్కెట్లో అత్యధిక ధరకు అమ్ముడుపోయే పండ్లలో ఒకటైన దానిని మన్యం ప్రాంతంలో గిరిజన రైతు పండిస్తుండడం విశేషం. మండలంలోని పెదబరడ గ్రామానికి చెందిన గిరిజన రైతు దొంగోజీ రామినాయుడు తన వ్యవసాయ పంట భూమిలో రెండు లక్ష్మణ ఫలం మొక్కలను నాటారు. ఆ చెట్టుకు గత ఏడాది నుంచి లక్ష్మణ ఫలాలు పక్వానికి వచ్చాయి. కాగా ఈ చెట్లు మెక్సికో, క్యూబా, బ్రెజిల్, పెరూ, వెనిజులా, వంటి దేశాల్లో కనిపిస్తాయి. అటువంటి ఈ పండును అల్లూరి మన్యంలో గిరిజన రైతు వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్నాడు. ఈ చెట్టు గాలిలో తేమ, వర్షపాతం ఎక్కువ ఉండే దట్టమైన అడవుల్లో పెరుగుతాయి. నేడు మన్యంలో, ప్రయోగాత్మకంగా తాను ఈ మొక్కలను పెంచడం జరిగిందని రామినాయుడు తెలిపారు. లక్ష్మణ ఫలంలో 12 రకాల కేన్సర్ కారక కణాలను నిర్మూలించే ఔషధగుణాలు ఉన్నాయి.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

లోకేష్‌కు హోంమంత్రి అనిత వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ని ఉండవల్లి నివాసంలో బుధవారం హోంమంత్రి వంగలపూడి అనిత మర్యాద పూర్వకంగా కలిశారు. పాయకరావుపేటలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి కేంద్రంగా పారిశ్రామికాభివృద్ధికి అవకాశం ఉన్న నేపథ్యంలో అక్కడ యువతకు పరిశ్రమలకు కావలసిన శిక్షణనందించడంలో తోడ్పాటు నందించాలని కోరారు. తన నియోజకవర్గంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించా లన్నారు. అదేవిధంగా పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్.రాయవరంలో బాలికల కోసం ప్రత్యేక జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయమే ఆధారంగా బతుకు సాగించే సాధారణ కుటుంబాలే తన నియోజకవర్గంలో అధికమని వివరించారు. చదువు ప్రాధాన్యత తెలుసుకుని చదివించాలనుకున్న తల్లిదండ్రులకు అమ్మాయిలను విద్యలో ప్రోత్సహించే క్రమంలో వ్యయ, ప్రయాసల అడ్డంకి రాకుండా ప్రత్యేక బాలికల కాలేజ్ ఏర్పాటు చేస్తే ఎంతోమంది ఆడబిడ్డలకు మేలు చేసిన వారవుతారని అక్కడ కాలేజ్ ఏర్పాటు ఆవశ్యకతను విద్యా శాఖ మంత్రి నారాలోకేశ్ కు హోంమంత్రి అనిత సవివరంగా వివరించారు.


లోకేష్ కు వినతిపత్రం అందజేస్తున్న అనిత

కూటమి ప్రభుత్వంలోనైనా..

సొంతింటి కల సాకారమయ్యేనా?

-జగనన్న కాలనీకి ఏర్పాటు చేయని రహదారి

-ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు

ప్రజాశక్తి - కోటవురట్ల:మండలంలో జల్లూరు గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన జగనన్న కాలనీకి దారి లేక పోవడంతో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. గ్రామం నడిబొడ్డునే సర్వే నెంబర్ 122లో 0.50 ఎకరాల భూమిని ప్రభుత్వం 20 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. ఈ స్థలంలో సుమారు 21 మంది లబ్ధిదారులను సైతం ఎంపిక చేయడం జరిగింది. విలువైన స్థలమే అయినా విలువ లేకుండా ఉంది.కాలనీకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరు ముందుకు రాలేదు, దీంతో కొనుగోలు చేసిన భూమి గడిచిన ఐదు సంవత్సరాలుగా వృధాగా దర్శనమిస్తుంది. పలుమార్లు లబ్ధిదారులు అధికారులకు నాయకులకు మొరపెట్టుకున్నా ఉపయోగ లేకుండా పోయింది. కొనుగోలు చేసిన స్థలం వద్దకు వెళ్లేందుకు పరిసర ప్రాంతాల్లో రైతుల నుంచి దారిని కొనుగోలు చేయాల్సి ఉంది. అప్పట్లో అధికారుల ముందుచూపు లేకుండా కాలనీ స్థలాన్ని కొనుగోలు చేయడంతో స్థానికులు, లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కాలనీకి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసి నిర్మాణాలు చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


జగనన్న స్థలం లే అవుట్


రాళ్లు తేలిన రహదారి

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..

ప్రజాశక్తి-కోటవురట్ల:కొడవటిపూడి శివారు గిరిజన గ్రామం కోదండరామపురం రోడ్డు నిర్మాణం గడిచిన నాలుగైదు సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచి పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం చేపట్టి నిలిపి వేయడంతో నడకదారి సైతం సక్రమంగా లేక గ్రామస్తులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రహదారి మార్గంలో నిర్మించిన కల్వర్టులు నాసిరకంగా నిర్మాణం చేపట్టడంతో పలుచోట్ల కల్వర్టు పగుళ్ళు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం స్పందించి గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.


పగుళ్లు వచ్చిన కల్వర్టు

నేడు అల్లూరి జిల్లాలో విద్యాలయాలకు సెలవు

ప్రజాశక్తి -పాడేరు: ఈ నెల 27వ తేదీన శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పాడేరు డివిజన్లో ఉన్న అన్ని విద్యా సంస్థలకు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గానికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో పోలింగ్ కేంద్రాలుగా కేటాయించిన భవనాలు ఉన్న సంస్థలకు స్థానిక సెలవుగా కలెక్టర్ ప్రకటించారు.